# దోపిడీ వర్గ న్యాయానికి మచ్చుతునక

## మారుతీ సుజికీ ఉద్యోగులకు యావజ్జీవ జైలుశిక్ష

**మనది** ప్రజాస్వామిక వ్యవస్థ అనీ, మన దేశంలోని న్యాయవ్యవస్థ స్వతంత్రమైనదనీ, అది ఎటువంటి పక్షపాతం చూపకుండా సమన్యాయాన్ని ప్రజలకు అందిస్తుందనీ మన దేశపు పాలకులూ, పాలకవర్గాలూ, పాలనా వ్యవస్థ సమర్ధక మేధావులూ నిరంతరం ప్రచారం చేస్తారు, నమ్మబలుకుతూరు. కానీ ప్రజల అనుభవంలో సమన్యాయం అందటం అన్నది అబద్ధమేనని వెల్లడి అవుతూనే వుంది. అయినా మన వ్యవస్థలో సమన్యాయం అందించబడుతుందన్న భ్రమే ప్రజల్లో బహుళంగా వుంది.

ఇటీవల పలు సందర్భాల్లో వెలువడుతున్న న్యాయస్థానాల తీర్పులు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ప్రసార మాధ్యమాలు కూడా ఆయా సందర్భాల్లో తీర్పులపట్ల, తమదైన వైఖరిలో ఆక్షేపణలను వ్యక్తం చేయటం అన్నది స్పష్టంగా కనబడుతోంది.

న్యాయవ్యవస్థ పవిత్రమైనదనీ, దాన్ని విమర్శించటం అపచారం అంటూ నమ్మబలికే మన చట్టాలు, న్యాయవ్యవస్థయొక్క వర్గస్వభావాన్ని, అది అందించే దోపిడీవర్గ న్యాయాన్ని ప్రశ్నించటమే అపచారం అన్నట్టుగా చేశాయి. అంతేగాక అలా ప్రశ్నించటం, న్యాయవ్యవస్థ ధిక్కరణ అన్నట్లుగా మలిచివేసి, ప్రశ్నించిన వారిని లేదా విమర్శించిన వారిని కోర్టు ధిక్కరణా నేరం క్రింద న్యాయవ్యవస్థే విచారించి, శిక్షించే అధికారాన్ని చట్టం యిచ్చింది. దాంతో యిక న్యాయవ్యవస్థలో భాగంగావున్న కోర్టులు యిచ్చే తీర్పుల అవకతవకల్ని, అసమర్ధనీయతను ప్రశ్నించే అధికారం బాధితులకుగానీ, ప్రజలకుగానీ చట్టబద్ధంగానే నిరాకరించటం జరిగింది. తప్పొప్పు లేమైనా, పై కోర్టులద్వారా మాత్రమే తేల్చుకోవాలి! తేల్చబడాలి!

ఇదీ మన 'ప్రజాస్వామిక' వ్యవస్థలో ప్రజలకు అందించబడే 'సమ' న్యాయంయొక్క విధానం.

నిజానికి మన చట్టాలూ, మన న్యాయవ్యవస్థా, దాని విధానాలూ ప్రజాస్వామ్యయుతంగా, ప్రజల ఇష్టా ఇష్టాలపై ఆధారపడి, ప్రజల ఆమోదంతో రూపొంద బడినవి కావు. బ్రిటిష్ వలస పాలకులు వారి దోపిడీ ప్రయోజనాల పరిరక్షణకోసం రూపొందించి, మన దేశంపై బలవంతంగా రుద్దినవే అవి. మన 'స్వతంత్ర' పాలకులు, పాలకవర్గాలూ ఆ చట్టాలనూ, ఆ పద్ధతులనూ, ఆ విధానాలనూ యధాతథంగా అంగీకరించి, అమలుపరుస్తూ వస్తున్నారు. అందువలన అటువంటి చట్టాలూ, అటువంటి న్యాయవ్యవస్థా, అటువంటి న్యాయాన్ని అందించే విధానాలూ ప్రజలకు సమన్యాయాన్ని అందిస్తాయనటంలోనే వుంది మోసం అంతా!

అప్పటికే పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడిదారీ వర్గాల ద్వారా యూరోపును రాజ్యమేలుతున్న కాలం లోనే, ఆ వ్యవస్థలోని న్యాయశాస్త్రం, న్యాయసూత్రాల తత్వశాస్త్రం, న్యాయాలయొక్క స్వభావాన్ని గురించి తమ ప్రముఖమైన 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో 1848నాడే మార్క్స్, ఏంగెల్సులు యీ రకంగా బట్టబయలు చేశారు: **"మీ యొక్క (బూర్జువా వర్గం యొక్క) అభిప్రాయాలు- మీయొక్క బూర్జువా ఉత్పత్తి, బూర్జువా ఆస్థుల స్థితిగతులనుండి పుట్టుకు వచ్చినవి. మీయొక్క న్యాయశాస్త్రం, న్యాయం, న్యాయశాస్త్రతత్వం అన్నవి, మీ వర్గంయొక్క ఇచ్ఛ-దాన్నే మీరు అందరికీ చట్టం చేశారు. ఆ ఇచ్ఛయొక్క ప్రధాన అంశం దాని యొక్క దిశలు అన్నవి, మీ వర్గంయొక్క మనుగడకు చెందిన ఆర్థిక పరిస్థితులచేతనే నిర్ణయించబడ్డవి".**

ఆ రకంగా న్యాయవ్యవస్థ ఏ వర్గానికి అనుకూల మైనదో అన్న విషయాన్ని, దానియొక్క దోపిడీ వర్గ స్వభావాన్ని నాడే మార్క్స్, ఏంగెల్సులు స్పష్టం చేశారు.

బ్రిటిష్ వలస పాలకులు రూపొందించిన న్యాయ సూత్రాలు, న్యాయవ్యవస్థా, న్యాయ విధానాలు నేటికీ మన 'స్వతంత్ర' భారతదేశంలో అమలు జరుగుతున్నా యంటే అర్థం, మన న్యాయవ్యవస్థ స్వతంత్రమైనది కాదనీ, దోపిడీ పాలకవర్గాల మనుగడకు అవసరమైన దోపిడీ ఆర్థిక పరిస్థితులనుండి నిర్ణయమైనదనీ అర్థంచేసుకోవటం సరయినదేకదా!

మనదేశపు న్యాయవ్యవస్థ మన దోపిడీ పాలక వర్గాల ఇచ్ఛకు, మనుగడకు అవసరమైన మారు రూపం మాత్రమే అని అర్థంచేసుకోవటం; అటువంటి సక్రమమైన అవగాహనపై ఆధారపడి తన కార్యక్రమాలను రూపొందించుకొని, భారత కార్మికవర్గం వ్యవహ రించటమే తన వర్గ కర్తవ్యంగా వుంటుంది.

పాలకవర్గాల మనుగడకు అవసరమైన కోర్కెనే చట్టంపేరిట, చట్టరూపంలో దోపిడీ పాలకవర్గాలు ప్రజలపై విధించి, దాన్నే 'సమన్యాయం' అంటూ, మన న్యాయవ్యవస్థను పవిత్రమైనదిగా ప్రచారంచేస్తూ తమ దోపిడీ వర్గ న్యాయాన్ని ప్రజలపై ప్రత్యేకించి నిరంతరం అమానుష శ్రమశక్తి దోపిడీకి గురయ్యే కార్మికవర్గంపై నిర్దాక్షిణ్యంగా అమలుజరుపుతున్నారు. ఈ దోపిడీ వర్గ న్యాయాన్నే, సమన్యాయంగా అంగీకరించమంటున్నారు.

ఇటీవలనే మారుతీసుజికీ కంపెనీ కార్మికులకు చెందిన ఒక వివాదంలో, అదనపు జిల్లా సెషన్సు కోర్టు జడ్జీయిచ్చిన తీర్పు దోపిడీవర్గ న్యాయానికి అద్దం పడుతోంది.

జపాన్ దేశపు ఆటో కంపెనీ అయిన సుజికీ కంపెనీకి, మనదేశంలో వున్న మారుతీ-సుజికీ కంపెనీ, కార్ల తయారీ అనుబంధసంస్థ. హర్యానాలోని గురుగావ్‌లో వున్న యీ సంస్థప్లాంట్లలో తయారు చేయబడే వివిధ పేర్లతోగల కార్లు, అటు

విదేశాలకు ఎగుమతి చేయబడటంద్వారా, యిటు భారతదేశ మార్కెట్లలో అమ్మబడుతూ, ఆ కంపెనీకి యిబ్బడి ముబ్బడిగా లాభాలు తెచ్చిపెడుతున్నాయి. రాయల్టీల రూపంలోనూ, సాంకేతికత అందించినందుకు చెల్లించే ఫీజురూపంలోనూ, జపాన్ నుండి వచ్చిన నిపుణులకు అధికాధిక వేతనాలు, సదుపాయాలూ, ప్రత్యేక హక్కులూ కల్పించే రూపంలోనూ, డివిడెండ్ల రూపంలోనూ ఏటా భారతదేశం నుండి వారి మాతృసంస్థకు వేలకోట్ల రూపాయలు తరలించుకుపోతున్నారు.

కానీ, ఆ ప్లాంట్‌లో తమ రక్తమాంసాలను, నైపుణ్యాలను ధారపోస్తూ తమ శ్రమశక్తిని వినియో గించటంద్వారా, కంపెనీ 'లాభాలు' దండుకోవటానికి సాధనంగావున్న కార్మికుల స్థితిగతులు, జీవన–పని పరిస్థితులు మాత్రం అత్యంత దారుణంగా వున్నాయి. ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు పనుల రూపంలో, ఆ సంస్థకోసం పనిచేసే కార్మికులు కేవలం కాంట్రాక్టు కార్మికులుగానే పరిగణింపబడుతూ, ఎటువంటి కార్మిక చట్ట రక్షణా లేకుండా, అత్యంత నిర్దాక్షిణ్యంగా దోచుకోబడుతున్నారు.

ఇటువంటి దారుణ పరిస్థితుల్లో సహజంగానే ఆ సంస్థలోని కార్మికులు(కాంట్రాక్టు) సంఘటితపడి, తమ జీవన, పనిపరిస్థితులు మెరుగుపరుచుకో పూనుకున్నారు. అక్కడ పనిచేస్తున్న అతికొద్దిమంది 'శాశ్వత' ఉద్యోగులు చేస్తున్న పనులనే తాము కూడా చేస్తున్నందున ఆ శాశ్వత కార్మికులతో సమానంగా జీత,భత్యాలూ, సదుపాయాలూ, కార్మిక చట్టాల రక్షణను పొందేందుకు, చట్టం–రాజ్యాంగం కల్పించిన 'సంఘాన్ని ఏర్పాటు చేసుకోవటం' అన్న హక్కు ప్రకారం ఒక యూనియన్‌ను ఏర్పాటు చేసుకొనే యత్నంలో వున్నారు. కానీ మారుతీ యాజమాన్యం, కార్మికులకు గల యీ చట్టబద్ధపు హక్కును నిరాకరిస్తూ, సంఘటితపడే యత్నంలో వున్న కార్మికులపై పలు రూపాల్లో దాడులు జరుపుతోంది. పలు కక్ష సాధింపు చర్యలకు గురిచేస్తోంది. శాశ్వత కార్మికులు, యీ కాంట్రాక్టు కార్మికులతో ఐక్యంకాకుండా చీలికలు తెస్తోంది. అడ్డుగోడలు నిర్మిస్తోంది. యూనియన్ ఏర్పాటు జరుపుతున్న కార్మికులపైకి పోలీసులను ఉసికొల్పుతోంది. పట్టుదలతో తమ సంఘ నిర్మాణాన్ని సాగిస్తున్న కార్మికులపై కంపెనీ స్వంతగూండాలద్వారా భౌతిక దాడులకు పాల్పడుతోంది. పనిచేస్తున్న(డ్యూటీ) సమయంలో కార్మికులపై సూపర్‌వైజర్లు జులుం జరపటం, కార్మికులపై చేయి చేసుకోవటమన్నది యాజమాన్యపు సంస్కృతిగా యిక్కడ అమలుజరప బడుతోంది.

ఒక విదేశీ కంపెనీ యాజమాన్యం, యిక్కడ మనదేశపు కార్మికులపై చట్టవిరుద్ధంగా, దుర్మార్గంగా, అమానుషంగా వ్యవహరిస్తూవుంటే, హర్యానా ప్రభుత్వం కానీ, పాలనాధికారవర్గంగానీ ఆ కార్మికుల తరపున నిలబడి, వారి హక్కులను పరిరక్షించి, చట్టాలను సక్రమంగా అమలుచేయటానికి బదులు "విదేశీ పెట్టుబడికి ఆటంకం కలుగకుండా పరిస్థితులు కల్పించే పేరిట" "ఆర్థికాభివృద్ధిపేరిట" మారుతీ యాజమాన్యానికి వత్తాసుపలుకుతూ, ఆ దుష్ట యాజమాన్యానికే మద్దతు నిస్తూ, న్యాయసమ్మతంగా తమ పరిస్థితులను మెరుగు పరుచుకోవటంకోసం చట్టబద్ధంగా వ్యవహరిస్తున్న ఆ కార్మికులకు వ్యతిరేకంగా వుండేందుకే నిర్ణయం చేసుకొన్నారు.

అయినా ఆ కంపెనీ కార్మికులు తమ హక్కుల పరిరక్షణకు, తమ పని పరిస్థితుల మెరుగుపరుచు కోవటానికి నడుం కట్టారు. అనివార్యంగానే వారు ఆందోళనా బాటను చేపట్టారు. తమ తరపున పోరాడే సాధనంగా తమ సంఘాన్ని నిర్మించుకోవటానికీ, బలపరుచుకోవటంకోసం తమ కృషిని సాగిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులూ, అప్రెంటీసులూ–రెగ్యులర్ (శాశ్వత) కార్మికులకూ మధ్య ఐక్యతను నిర్మించి, బలోపేతం చేసుకోవటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు.

తన వర్గ స్వభావానికి అనుగుణంగానే మారుతీ యాజమాన్యం యీ కార్మికుల ఐక్యతను, సంఘాన్ని విచ్ఛిన్నం చేయటానికీ, రూపుమాపటానికీ తన శక్తియుక్తులనుపయోగిస్తోంది. ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్ల ద్వారా, స్వంత గూండాలద్వారా కార్మికులపై దాడులు సాగిస్తోంది.

ఈ నేపథ్యంలో జులై 18, 2012 నాటి ఒక ఘటన కార్మికుల–యాజమాన్యం మధ్యగల వివాదపు తీవ్రతనూ, యాజమాన్యపు దుష్ట, అమానుష, దోపిడీ స్వభావాన్నీ బట్టబయలుచేసింది.

పనిచేస్తున్న ఒక కార్మికుని సూపర్‌వైజర్ బూతులు తిట్టి, అతనిని చెంపపై కొట్టాడు. అది చాలదన్నట్లు యాజమాన్యం బాధిత కార్మికుని పనినుండి అక్రమంగా తొలగించింది. ఈ ఘటన కార్మికుల ఆగ్రహానికి దారి తీసింది. పనినుండి అక్రమంగా తొలగించబడిన కార్మికుని పనిలో పెట్టుకోమని డిమాండ్ చేస్తూ కార్మికులు కంపెనీ ఆఫీసు ముందు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చర్యలకోసం కొందరు యూనియన్ కార్యకర్తలు ఆఫీసులో వుండి చర్చలు జరుపుతున్నారు. ఇంతలో ఆఫీసుకు నిప్పంటుకొంది. ఆ మంటలనుండి బయటకు వచ్చే క్రమంలో కంపెనీ హెచ్.ఆర్.మేనేజరు ఒకరు మరణించారు. ఆఫీసులో నిప్పు మంటలు రావటానికి కారణం తెలియరాలేదు. కానీ యాజమాన్యం మాత్రం యిది కార్మికుల పనేననీ, వారు కంపెనీ ఆవరణలో అల్లర్లకు, దహనకాండకూ, హెచ్‌ఆర్ అధికారి హత్యకూ పాల్పడ్డారు అంటూ అబద్ధపు ఆరోపణలతో, గగ్గోలు చేసింది. పోలీసులను రంగంలోకి దించింది. ఈ ఘటన సాకుతో సంఘటిత పడుతున్న కార్మికులనూ, వారి సంఘాన్నీ సర్వనాశనం చేసే కుట్రలకు పాల్పడింది. హర్యానా రాష్ట్రప్రభుత్వం, యాజమాన్యానికి తన పూర్తి సహకారాన్ని అందించింది. మీడియా కూడా యాజమాన్యానికి అనుకూలంగా, కార్మికులను నేరస్థులుగా నిందిస్తూ విపరీతమైన ప్రచారానికి పాల్పడింది.

ఈ సంఘటన సాకుతో కార్మికులపై తీవ్రమయిన దాడిని మొదలెట్టిన మారుతీ–సుజ్‌కీ యాజమాన్యం, తన వికృతమైన, దోపిడీ రూపాన్ని, విదేశీ పెట్టుబడి (సామ్రాజ్యవాద)యొక్క నిర్దాక్షిణ్య శ్రమశక్తియొక్క దోపిడీ స్వభావాన్ని నగ్నపరుస్తూ, బట్టబయలు చేసుకొంది.

ఈ ఘటన సాకుతో 546 మంది శాశ్వత ఉద్యోగులతో సహా 2500 మంది కార్మికులను పని నుండి అక్రమంగా తొలగించింది. పోలీసులను కార్మికులపైకి ఉసికొల్పింది. వాళ్ళు కార్మికుల యిళ్ళపై, యూనియన్ ఆఫీస్‌పై దాడి జరిపారు. 148 మంది కార్మికులను

అరెస్టుచేసి, వారిపై పలు అక్రమ నేరారోపణలు చేశారు. వాళ్ళు లాఠీలతోనూ, రాడ్లతోనూ దాడిచేశారనీ, దహనకాండ జరిపారనీ ఆరోపించారు. అయితే విచిత్రమేమిటంటే ఆ కార్మికులు ఉపయోగించారన్న లాఠీలు, రాడ్లలో మారుతీ కంపెనీ ఆవరణలో ఒక్కటి కూడా కనిపించలేదు. అందువలన ప్రాసిక్యూషన్ వారు మాటమార్చి, ఆ కార్మికులు కారుతలుపుల బీమ్స్‌తోనూ, షాకర్లతోనూ దాడిచేశారని తమ ఆరోపణను మార్చివేసుకొన్నారు.

ఆ ఘటన జరిగిన నాటి సి.సి.టి.వి. రికార్డింగుల ఫుటేజీలు బయటపెడితే వాస్తవాలు వెల్లడయ్యేవి. కానీ మారుతీ యాజమాన్యం, ఆ ఘటన జరిగిన సందర్భంలో సి.సి.టి.వి. సిస్టమ్ పనిచేయటల్లేదని చెప్పి, వాస్తవాలను వెల్లడించ నిరాకరించింది.

పోలీసులు – యూనియన్ నాయకులను, కార్యకర్తలను వెంటాడి, వేటాడి అరెస్టు చేశారు.

ఇక అల్లర్లలో – దహనకాండలో పాల్గొన్నారని చెప్పబడే కార్మికుల పేర్ల జాబితాను కార్మికులను సరఫరాచేసే నలుగురు కాంట్రాక్టర్లు అందచేశారు. ఆ జాబితానుండి ఎంచుకొన్న పేర్ల వారిని, పోలీసులు కోర్టులో ముద్దాయిలుగా ప్రవేశపెట్టారు. తీరా చూస్తే వారిలో ఏ ఒక్కర్నీ ఆ కాంట్రాక్టర్లు కోర్టులో గుర్తుపట్టలేక పోయారు.

అరెస్టు చేయబడ్డ 148 మందికీ కోర్టు బెయిల్ కూడా మంజూరు చేయలేదు. ఆఖరుకు సుప్రీంకోర్టు కలుగజేసుకొని, 2015 ఫిబ్రవరి 23 నాడు కేవలం ఇద్దరికి మాత్రమే బెయిల్ యిచ్చింది. మిగిలిన వారందరూ శిక్షలు వెలువడేదాకా జైలులోనే వుండి, అప్రకటిత శిక్షను అనుభవించారు.

ఈ కేసును విచారించిన అదనపు జిల్లా మరియు సెషన్సు కోర్టు ఎట్టకేలకు 2017 మార్చి 10న, నాలుగున్నర సంవత్సరాల అనంతరం 148 మంది కార్మికుల్లోనూ, 31 మందిని నేరస్తులుగా తీర్పు నిచ్చింది. అందులో 13 మందిని (వీరిలో 12 మంది మారుతీ సుజికీ కార్మికుల సంఘానికి నాయకత్వ స్థానంలో వున్న కార్యనిర్వాహక కమిటీ సభ్యులే) హత్యానేరం, హత్యాప్రయత్నం, అల్లర్లు చేసిన నేరస్థులుగా నిర్ధారించింది. మిగిలిన 18 మందిని అల్లరిచేసిన, ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించిన, యితరులకు గాయాలు కల్గించిన తదితర నేరాలు చేసిన నేరస్థులుగా నిర్ధారించింది.

మొదటి 13 మందికి యావజ్జీవ కారాగారశిక్ష, 4 గురికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన 14 మందినీ అప్పటికే నాలుగున్నర సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించిన కారణంగా వదలిపెట్టింది. 148 మందిలో యీ 31 మందిపోగా మిగిలిన 117 మందిని నేరంతో సంబంధం లేనివారిగా విడిచిపెట్టింది.

కోర్టు యిటువంటి తీర్పును యిచ్చిన రోజున ప్రభుత్వం కోర్టు పరిసర ప్రాంతాల్లోనూ, మానేసార్ టౌన్‌షిప్‌లోనూ 144వ సెక్షను విధించింది. మారుతీ సుజికీ ప్లాంట్ చుట్టూ 500 మీటర్ల పరిధిలో కూడా 144వ సెక్షను విధించింది.

ఈ రకంగా ఒక అక్రమమైన తీర్పు వెలువడ నున్న సూచికను ప్రభుత్వం వెల్లడించింది.

అధికార పాలకపార్టీల నేరస్థ రాజకీయ నాయకులను, ఘోరమైన అవినీతిపరులు, కరుడుగట్టిన హంతకులు, రూఢిపరచబడ్డ టెర్రరిస్టులు మొదలైన వారందరినీ, పాలకుల–పాలకవర్గాల ప్రాపకం వుంటే, ఎన్నో న్యాయసూత్రాలను వల్లిస్తూ, తగిన సాక్ష్యాధారాలు లేవన్న సాకుతో, వదిలిపెట్టి తాను న్యాయం అందిస్తున్నట్లు అభినయించే న్యాయవ్యవస్థ, ఎటువంటి ఆధారాలు లేకపోయినా మారుతీ యూనియన్ నాయకులను హత్యానేరం క్రింద, యావజ్జీవ జైలుశిక్షకు గురిచేయటం అన్నది, దోపిడీవర్గ న్యాయానికి ఒక స్పష్టమయిన దాఖలాగా మన ముందు వుంది.

సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ళ కేసులోనూ, హైదరాబాద్ మక్కామసీదు పేలుళ్ళ కేసులోనూ, ఎందరో ముస్లింలను బలిగొన్నా, అందుకు తానే కారణమని గతంలో అంగీకరించిన ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అయిన సన్యాసిఅయిన స్వామీ అసిమా నందను, హిందూత్వ వాద టెర్రరిస్టును, ప్రాసిక్యూషన్‌కు సాక్షులు అడ్డం తిరిగారన్న సాకుతో వదిలివేసిన న్యాయ వ్యవస్థ, మాలెగావ్ కేసులో ముద్దాయిగా వుండి, సహచరుని హత్యకేసులో నేరస్థురాలిగా వున్న సాధ్వి ప్రగ్యాసింగ్‌ను సునీల్‌జోషి హత్యకేసులో నిరపరాధిగా నిర్ణయించగలిగిన న్యాయవ్యవస్థ, మారుతీ–సుజికీ కేసులో యూనియన్ నాయకులను హంతకులుగా నిర్ధారించటమంటే, యిది దోపిడీవర్గ న్యాయం అన్న దానిలో సందేహం ఏముంది?!

భారతదేశ న్యాయచరిత్రలో మచ్చుకు ఒక్క పారిశ్రామికవేత్తనుగానీ, యాజమాన్యాన్నిగానీ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ అమానవీయంగా, దారుణ దోపిడీ చేస్తున్నందుకు శిక్షించిన ఒక్క ఉదంతంకూడా లేదు. యాజమాన్యం, యజమానుల నేరపూరిత, ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యంవలన పని ప్రదేశ ప్రమాదాలలో నిరంతరం చంపబడుతున్న కార్మికుల హత్యలకుగాను ఒక్క యజమానిని కూడా హత్యానేరం క్రింద విచారించి, శిక్షించిన (సాక్ష్యాలు ప్రబలంగావున్నా) సందర్భం ఒక్కటి కూడా లేదు.

ప్రస్తుత కేసులో అకారణంగా, కోర్టు తీర్పు ప్రకారమే యిరికింపబడి, నాలుగున్నర సంవత్సరాల పాటు అక్రమ జైలుశిక్షను అనుభవింపజేసిన, వారిని ఉద్యోగాలనుండి తొలగించి, వారి కుటుంబ సభ్యులకు ఎనలేని కష్టాల్నీ, బాధల్నీ కలిగించిన బాధ్యులకు (యాజమాన్యం, పోలీసు) ఎటువంటి శిక్షనూ ఆ కోర్టు విధించలేదు.

ఇదే దోపిడీవర్గ న్యాయం అంటే!

చట్టబద్ధంగా వ్యవహరించటం అంటే దోపిడీవర్గ చట్టాలకు అనుకూలంగా వ్యవహరించటమే!

మన దేశంలోని కార్మికులూ, కార్మికవర్గమూ యీవిధంగా వివిధ రూపాలలో వున్న మన దోపిడీ వ్యవస్థయొక్క, వర్గదోపిడీ స్వభావాన్ని అర్ధం చేసుకోవటంవల్లనే, తాము నిర్వహించాల్సిన చారిత్రక కర్తవ్యాన్ని మరింత ప్రతిభావంతంగా, సక్రమంగా నిర్వర్తించగలుగుతారు!

00000